## సహకార సంఘాలకు నామినేటెడ్ ముద్ర!







## బీసీ సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా అనిల్



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వకపోతే ఓటరు జాబితాలో పేరు గల్లంతు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అనుసరిస్తూ ప్రతిఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారంను నింపి బూత్ లెవెల్ అధికారికి అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. కంజర్ రైతు వేదికలో కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రతి ఓటరు ప్రాధాన్యత ఇస్తూ తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాలు బీఎల్‌వోలకు సమర్పించాలన్నారు. లేనిపక్షంలో ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉండదన్నారు. గడువు లోగా అందరూ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, ఈ మేరకు ప్రజాప్రతినిధులు కూడా తమవంతు బాధ్యతగా చొరవ చూపాలని సూచించారు.


10-7-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు త్వరితగతిన బీఎల్‌వోలకు అందించాలి




**అక్షరటుడే, ఇందూరు:** ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి బీఎల్‌వోలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. వివరాలను డిజిటలైజేషన్ చేయాల్సి ఉన్నందున, నిర్ణీత గడువు వరకు వేచి చూడకుండా వెనువెంటనే ఫారాలను నింపి బీఎల్‌వోలకు సమర్పించాలని ఓటర్లను కోరారు. ఓటర్ల నుండి ఫారాల స్వీకరణ, వాటి వివరాలను డిజిటలైజ్ చేయడంలో వెనుకంజలో ఉన్న సూపర్ వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతి చూపని నిజామాబాద్ అర్బన్ పరిధిలోని ముగ్గురు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయని వారిపై ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. గడువు సమీపించిన దృష్ట్యా శని, ఆదివారాలు సెలవు దినాల్లో కూడా పని చేయాలని తేల్చి చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



## జనసేన పార్టీలో చేరిన తెలంగాణ ఉద్యమ నేత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమ నేత సామాజిక కార్యకర్త మీసాల ఫౌండేషన్ అధినేత మీసాల శ్రీనివాసరావు జనసేనలో చేరారు. హైదరాబాద్ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నివాసంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ మీసాల శ్రీనివాస్‌తో తమకు 20ఏళ్ల అనుబంధం ఉందని.. అదేవిధంగా మీసాల ఫౌండేషన్ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రజలకు చేరువై జనసేన సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు ప్రజా సేవకు పార్టీ కట్టుబాటు పవన్ కళ్యాణ్ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరినట్లు తెలిపారు.




# విజయవంతంగా 'బడిబాట'

> ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలంటే గతంలో అనేక విధాలుగా ఆలోచించేవారు. సరైన వసతులు లేవని, ఉపాధ్యాయులు ఉండరని సాకులు వెతికేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి పోయింది. ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు కూడా ప్రైవేటుకు ధీటుగా వస్తున్నాయి.
>
> – అక్షరటుడే, కామారెడ్డి

- ఈ ఏడాది సత్తా చాటిన కామారెడ్డి
- గతేడాది నమోదు దాటేసి రాష్ట్రంలో 4వ స్థానం
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడులకు 4,031 మంది వలస
- ఎఫ్ఆర్ఎస్ హాజరు, విద్యార్థుల హాజరులోనూ రాష్ట్రంలో 2వ ర్యాంకు

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగింది. జిల్లా యంత్రాంగం సమన్వయంతో చేసిన కృషి ఫలితంగా బడిబాట 2026 నమోదులో కామారెడ్డి జిల్లా రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుకోవడం, అందుకు అనుగుణంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడమే ఈ స్థానం వచ్చిందనడంలో సందేహమే లేదు.

### 478 మంది అదనపు చేరికలు

ఈ నెల 8 వరకు యూడైస్ పోర్టల్ ప్రకారం జిల్లాలో మొత్తం 81,807 మంది విద్యార్థులు నమోదు కాగా, గత విద్యా సంవత్సరం 81,329తో పోలిస్తే 478 మంది అదనంగా ప్రభుత్వ బడుల్లో చేరారు. జూన్ 15 నుంచి ఇప్పటివరకు 17,132 మంది కొత్త విద్యార్థులు ప్రవేశాలు పొందారు. గతేడాది నమోదును దాటిన జిల్లాల జాబితాలో కామారెడ్డి 4వ స్థానంలో నిలిచింది.

### కేజీవీబీ.. ప్రీ-ప్రైమరీలోనూ పురోగతి

కస్తూర్బా పాఠశాలల్లోనూ విద్యార్థుల నమోదు గతంలో కంటే పెరిగింది. గతేడాది 5,538 మంది ఉండగా, ఈసారి 5,789 మంది చేరారు. 10శాతం అదనపు లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంకా 91 ప్రవేశాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. జిల్లాలోని 166 ప్రీప్రైమరీ పాఠశాలల్లో లక్ష్యం 2,490 కాగా, ప్రస్తుతం 2,374 మంది పిల్లలు నమోదయ్యారు.

### ప్రభుత్వ బడుల వైపు మొగ్గు

ఈ ఏడాది 4,031 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారారు. ఈ విభాగంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో 3వ స్థానం సాధించింది. అదే సమయంలో ప్రభుత్వం నుంచి ప్రైవేట్‌కు వెళ్లిన వారు కేవలం 229 మంది మాత్రమే ఉండడం విశేషం. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సంఖ్య మరిన్ని రోజుల్లో పెరగనుండగా ప్రైవేటులో భారీగా తగ్గే అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది.


### హాజరులోనూ రాష్ట్రంలో 2వ స్థానం

గతంలో పాఠశాలలకు డుమ్మాలు అధికంగా ఉండేవి. వివిధ పనుల నిమిత్తం ఉపాధ్యాయులు ఎప్పుడు పడితే అప్పుడు బయటకు వెళ్లేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎఫ్ఆర్ఎస్ స్టాఫ్ హాజరు నమోదులో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచింది. విద్యార్థుల హాజరులోనూ అదే స్థానం దక్కించుకోవడం జిల్లా విద్యాశాఖ సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది.

### లక్ష్యం సాధించిన అధికారులు

జిల్లాలో మండల వైద్యాధికారులు 10 శాతం అదనపు ప్రవేశాల లక్ష్యాన్ని ఇప్పటికే సాధించారు. ఈ కేటగిరీలో మాచారెడ్డి ఎంఈఓ సురభి దేవేందర్ రావు, తాడ్వాయి ఎంఈఓ రామస్వామి ఉన్నారు. లక్ష్యాన్ని పూర్తి చేసిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల జాబితాలో ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ కాంప్లెక్స్ హెచ్ఎం సంగారెడ్డి, కల్వారాల కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్, చుక్కాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం దేవేందర్ రావు ఉన్నారు.

### అధికారులకు అభినందనలు



బడిబాట విజయానికి అధికారుల సహకారం మర్చిపోలేనిది. సహకరించిన అడిషనల్ కలెక్టర్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలకు అభినందలు.

– **మల్లికార్జున్, డీఈవో, కామారెడ్డి**

### ప్రతిఒక్కరూ బడిలో చేరేవరకు పని చేయాలి



జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన బాలబాలిక ప్రభుత్వ పాఠశాలలో చేరే వరకు ఇదే ఉత్సాహంతో పని చేయాలి. నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలతో తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం విద్యాశాఖ సిబ్బంది, ఇతర అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి. తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకు రావాలి.

– **ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్ కామారెడ్డి**



## ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో నిర్లక్ష్యం.. బాన్సువాడ ఎంపీవోపై వేటు

**అక్షరటుడే, బాన్సువాడ:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో బాన్సువాడ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)పై వేటు వేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని సక్రమంగా పర్యవేక్షించడంలో ఎంపీవో నాగరాజు విఫలమైనట్లు అధికారుల పరిశీలనలో తేలిందని సమాచారం. అలాగే పైఅధికారుల ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు ఎంపీవో నాగరాజును హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

## విద్యార్థిని ఆత్మహత్య ఘటన.. వార్డెన్ సస్పెన్షన్

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఎస్సీ బాలికల గురుకుల వసతి గృహంలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో వార్డెన్‌పై చర్యలు తీసుకున్నారు. ఘటనలో నిర్లక్ష్యం ఉన్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వార్డెన్ మమతను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వెంకటేష్ విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డెన్ మమతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. సదరు విద్యార్థిని వారం రోజుల క్రితమే బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి, టీచర్స్ కాలనీలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటోంది. బుధవారం కళాశాలకు వెళ్లకుండా హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నగరంలో 'ఎస్ఐఆర్'పై అవగాహన సదస్సు



**అక్షరటుడే, ఇందూరు :** ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతో కీలకమైనదని, ప్రజలందరూ తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేయాలని డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. నగరంలో 42, 41, 40, 17, 11, 8, 27, 34 డివిజన్లలో ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వేపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతో కీలకమైనదని, ప్రజలందరూ తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేయాలని కోరారు. గత 2002 ఓటరు జాబితాలో ఉన్న విధంగానే వివరాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు తమ పరిధిలోని బూత్‌లలో అందుబాటులో ఉంటూ, ప్రజలకు ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో సహాయం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, బీఎల్ఏ సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన డివిజన్లలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బూత్ లెవెల్ ఏజెంట్లు స్థానిక బీఎల్ఓలకు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో బీఎల్ఏ సూపర్‌వైజర్లు అవీన్, సాయి బసవ, శివ చరణ్, బంటు బలరాం, శోభన్, లవంగ ప్రమోద్‌లతో పాటు డివిజన్ ఇన్‌ఛార్జీలు రమేష్, అన్వర్, కరీముద్దీన్, సాయిలు, నరేందర్, ప్రవీణ్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏబీవీపీ 78వ జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఏబీవీపీ ముఖ్య నాయకుడు కైరి శశిధర్ మాట్లాడుతూ.. 1949 జూలై 9న కేవలం కొద్దిమందితో ప్రారంభమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించి 78వ వసంతంలోకి అడుగుపెట్టడం గర్వకారణమన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై పోరాడటమే కాకుండా, దేశ పునర్నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేస్తూ జాతీయ భావాలను పెంపొందిస్తోందని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని కోరారు. కేవలం నిరసనలు, ధర్నాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఏబీవీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శివప్రసాద్, కంఠేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గాదాస్, సాయికుమార్, రాజేష్, వీరేష్, సన్నీ పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం




**అక్షర టుడే,కామారెడ్డి:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని 38,19వ వార్డులలో ప్రత్యేక అవగాహన, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహాల చుట్టుపక్కల నీటి తొట్టెలు, పాత టైర్లు, కుండలు, ప్లాస్టిక్ సామగ్రిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నిల్వ నీటి కారణంగా దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఇంట్లో నిల్వ ఉన్న నీటిని పారబోసి డ్రైడేగా పాటించడం ద్వారా వ్యాధులను అదుపు చేయవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు పొడిగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు భాను, కళ్లెం సత్యం, యూనస్, డీఈ హన్మంతరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2025-26లో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కల్పన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్య ద్వారానే జీవితంలో విజయాలను అందుకోవచ్చని సూచించారు. ఎంఈవో గంగారాం విద్యార్థుల విజయాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్పన ట్రస్ట్ అధ్యక్షుడు జి. మహిపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ చిన్నయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా అనిల్ కుమార్



**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా నాయీబ్రాహ్మణ సంఘానికి చెందిన అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మీడియాకు వివరాలు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా బీసీల హక్కుల కోసం అదేవిధంగా నాయీ కుల సభ్యుల అభ్యున్నతికి పోరాడుతున్న అనిల్ కుమార్ నియామకంతో బీసీ సంక్షేమ సంఘం బలోపేతం అవుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం గంగా కిషన్ అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్‌తో పాటు పోల్కం గంగాకిషన్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, కోడూరు స్వామి, రవణ స్వామి, గంగాధర్, సురేందర్, నరహరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## నల్లూరు పాఠశాలకు విద్యా సామగ్రి పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పెండం జీవన్, ఆయన సతీమణి సరోజా, కుమారుడు ప్రదీప్ (ఆస్ట్రేలియా), కోడలు మేధా సహకారంతో సుమారు రూ.80వేల విలువైన పాఠ్యపుస్తకాలు, పాఠశాల బ్యాగులు, పెన్సిళ్లు, పెన్ బాక్స్‌లు తదితర విద్యా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనిచ్చిన దాతలకు గ్రామ ప్రజల తరపున, తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లావణ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్కం గంగాధర్, జీపీవో సురేష్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు నవీన, జ్యోత్స్న, నాగరాణి, కవిత, లక్ష్మి, సౌజన్య, శ్రీజ, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి,తెలంగాణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఇకపై ఎన్నికలు జరగకపోవచ్చు. ఎన్నికల నిర్వహణకు బదులుగా, పూర్తిగా నామినేటెడ్ పద్ధతిలోనే పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. – అక్షరటుడే, ఎల్లారెడ్డి,




# ‘నామినేటెడ్’ ముద్ర!

- ఎన్నికలకు స్వస్తి పలికే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- ప్రక్రియ పూర్తికి సన్నాహాలు
- ఆశావాహుల పైరవీలు..
- ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు

గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల ఎన్నికలు రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. డైరెక్టర్ పదవుల నుంచి ఛైర్మన్ స్థానం వరకు ప్రతి ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారడం, భారీగా డబ్బు ఖర్చవ్వడం, రాజకీయ ఘర్షణలకు దారితీయడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### ఉమ్మడి నిజామాబాద్‌లో..

గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఏసీఎస్ సహకార పదవుల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సహకార రంగ చరిత్రలోనే తొలిసారిగా, వ్యవసాయ మార్కెట్ కమిటీల తరహాలో ఎన్నికలు లేకుండా నామినేటెడ్ విధానంలోనే వీటిని భర్తీ చేయాలని భావిస్తోంది. ఈ నిర్ణయంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 144 సహకార సంఘాల్లో ఒకేసారి 1,872 డైరెక్టర్ పదవులు భర్తీ కానున్నాయి. ఎన్నికలు లేకుండా నేరుగా పదవులు వస్తుండటంతో అధికార పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. పదవుల కోసం ఆశావాహులు స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హైదరాబాద్ బాట పట్టి పైరవీలు షురూ చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు పదవులు దక్కలేదన్న క్యాడర్ అసంతృప్తిని చల్లార్చేందుకే ప్రభుత్వం ఈ వ్యూహాన్ని ఎంచుకుంది. రైతులతో నేరుగా సంబంధాలుండే ఈ కీలక పదవుల ద్వారా గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది.

### 13 మందితో పాలకవర్గం.. రిజర్వేషన్లు తప్పనిసరి

సహకార చట్టం ప్రకారం ప్రతి పీఏసీఎస్‌కు 13 మందితో కూడిన పాలకవర్గం ఉంటుంది. ఇందులో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతో పాటు 11 మంది డైరెక్టర్లు ఉంటారు. నామినేషన్ల ప్రక్రియలోనూ చట్ట ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన మూడు పోస్టులను తప్పనిసరిగా భర్తీ చేయాల్సి ఉంటుంది. మిగిలిన స్థానాలను జనరల్ కేటగిరీ కింద భర్తీ చేస్తారు. ఈ ప్రాథమిక సంఘాల పాలకవర్గాల నుంచే డీసీసీబీ, డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్, టెస్కాబ్ వంటి ఉన్నత సహకార సంస్థలకు ప్రతినిధుల ఎంపిక జరుగుతుంది.

### సభ్యత్వం ఉన్న రైతులకే ఛాన్స్!

నామినేటెడ్ విధానాన్ని తీసుకొచ్చినా, నిబంధనల విషయంలో ప్రభుత్వం కఠినంగానే వ్యవహరించనుంది. సదరు పీఏసీఎస్‌లో ఖచ్చితంగా సభ్యత్వం కలిగి ఉన్న రైతులకు మాత్రమే పాలకవర్గాల్లో అవకాశం కల్పించాలని స్పష్టమైన నిబంధన విధించింది. సభ్యత్వం లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ పదవులు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలు పూర్తిగా నామినేషన్ విధానంలోనే భర్తీ అవుతున్నాయి.. ఇదే ఫార్ములాను పీఏసీఎస్‌లకు కూడా వర్తింపజేయనున్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులకు పదవులు రానున్నాయి.

## టీఆర్పీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే గద్దెను కూల్చారు..




**అక్షరటుడే, కామారెడ్డి:** తమ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే జెండా గద్దెను కూల్చివేశారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల హన్మాండ్లు ఆరోపించారు. గురువారం రాత్రి కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న పార్టీ గద్దె కూల్చివేయడంతో ఆయన పరిశీలించారు. నాయకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీ జెండా గద్దె కూల్చేయడం క్రూరమైన చర్య అన్నారు. పక్కన ఇతర పార్టీల జెండాలు ఉన్నప్పటికీ కేవలం టీఆర్పీ గద్దెను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేశారని తెలిపారు. తీన్మార్ మల్లన్న బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటున్నందుకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై కమిషనర్‌కు ఫోన్ చేస్తే రెండు రోజులుగా సెలవులో ఉన్నానని, ఇన్‌ఛార్జి కమిషనర్‌ను అడిగితే తెలియదని చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ తాహెర్, ఉపాధ్యక్షుడు కళ్లెం రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సబ్బిడి రమేష్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్ పాల్గొన్నారు.

## జూలై 11 నుంచి కుటుంబ నియంత్రణ వారోత్సవం



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జూలై 11 నుండి 18 వరకు జిల్లాలో ప్రత్యేక కుటుంబ నియంత్రణ వారోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అవగాహన ర్యాలీలు, గ్రామ సభలు, మహిళా సంఘాల సమావేశాలు, యువ దంపతులకు కౌన్సెలింగ్, ఇంటింటి ప్రచారం, పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, ప్రత్యేక కుటుంబ నియంత్రణ శిబిరాలను నిర్వహిస్తామన్నారు. పిల్లలకు సరైన అంతరం ఉంటే, కుటుంబాలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటాయని పేర్కొన్నారు. పిల్లల మధ్య తగిన అంతరం పాటించడం వల్ల తల్లి, శిశు మరణాలు తగ్గుతాయని, పోషకాహార లోపాలు, తక్కువ బరువుతో పుట్టే శిశువుల సంఖ్య తగ్గుతుందని, కుటుంబ ఆర్థిక స్థితి, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వివరించారు. ఆశా, ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏలు అర్హులైన దంపతులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన సీపీఐ నాయకులు




**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సీపీఐ నాయకులు శుక్రవారం సందర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మోతీరాం మాట్లాడుతూ..ఆస్పత్రిలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. విద్యుత్ సౌకర్యం లేక గదులన్నీ చీకట్లో ఉన్నాయని.. బాత్రూంలు దుర్వాసనతో నిండిపోయాయన్నారు. పాలకులు, అధికారులు వెంటనే ఆస్పత్రిని సందర్శించి సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రకాష్, కిషన్ రావు, మధు, రాములు, గణేష్ పాల్గొన్నారు.

## బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముస్కు నర్సయ్య



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలానికి చెందిన ముస్కు నర్సయ్య బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముస్కు నర్సయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతంతో పాటు రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానని ముస్కు నర్సయ్య పేర్కొన్నారు.



## నేత్రదానం చేసి.. ఆదర్శంగా నిలిచిన రామరాణి

**అక్షరటుడే కోటగిరి :** పోతంగల్ మండలం చేతన్ నగర్ గ్రామానికి చెందిన మల్లాది రామరాణి (78) గురువారం మృతి చెందింది. తాను మరణించాక తన కళ్లను దానం చేయాలని ఆమె ముందే కుమారులను కోరడంతో కుమారులు బీర్కూర్ లయన్స్ క్లబ్ ఛైర్మన్ సీతలే రమేష్‌కు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన వెంటనే బోధన్ లయన్స్ క్లబ్ ఆస్పత్రికి తెలియజేసి ఆమె కళ్లను సేకరించారు.

## ఆలూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం



**అక్షరటుడే, ఆర్మూర్ :** మండలంలోని ఆలూర్, గగుపల్లి, రామచంద్రపల్లి, గుత్ప గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తహశీల్దార్ రమేష్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను తనిఖీ చేసి, బీఎల్‌వోలు చేపడుతున్న నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. తహశీల్దార్ రమేష్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌కు సంబంధించిన దరఖాస్తు ఫారాలను ఈ శని, ఆదివారాల్లోపు సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## కల్లడిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లడిలో ఏడుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కల్లడి గ్రామంలో ప్రజలు ఎవరైనా అనారోగ్య రీత్యా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఖర్చులను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పిస్తానని పేర్కొన్నారు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారికి అనారోగ్యంతో ఉంటే ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎల్‌వోసీ ఇప్పించి వైద్య సేవలు అందేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కున్సోత్ కిసాన్ , పూదరి నరేందర్ సార్, బోడిగం నాగేష్, కాండ్రే సాయిచరణ్, సిరికొండ భూమన్న, భాషెట్టి ప్రతాప్, దాసరి రాధాస్వామి, పురస్తే భూమన్న, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు డెస్క్ బెంచీల విరాళం..



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎన్నారై, సమాజ సేవకుడు రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలోని రామ్ నోముల ట్రస్ట్ తరపున 25 డ్యుయల్ డెస్క్ బెంచీలను శుక్రవారం అందజేశారు. సర్పంచ్ కట్ట నర్సయ్య మాట్లాడుతూ రామ్ నోముల ట్రస్ట్ మచర్ల గ్రామ అభివృద్ధికి ఎప్పటికప్పుడు సహకరిస్తోందన్నారు. గతంలో గ్రామంలో వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు చేయడంతో పాటు అదనపు తరగతి గది నిర్మాణానికి కూడా నిధులు అందించిందని గుర్తు చేశారు. తన అభ్యర్థనకు స్పందించి వారు ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సదుపాయాల కల్పనలో ట్రస్ట్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పేర్కొంటూ రాంచంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈవో నరేందర్ మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యాభ్యాస వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శుక్రవారం మున్సిపల్, ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, కోఆప్షన్ సభ్యులు కమర్ సుల్తానా గౌస్, 13వ వార్డు కౌన్సిలర్ ఖలేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం అన్ని వార్డుల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం ద్వారా డెంగీ, విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చన్నారు. ప్రజలంతా తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నీటి నిల్వల వల్ల దోమలు వ్యాప్తి చెంది డెంగీ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, పవన్, ఖదీర్, కిషోర్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.